క్లుప్తంగా

గ్రంథాలయానికి కంప్యూటర్ సౌకర్యం



కంప్యూటర్, ప్రింటర్‌ను చూపిస్తున్న లైబ్రేరియన్ దుర్గాప్రసాద్

బాడంగి: మండల కేంద్రంలోని ప్రభుత్వ శాఖా గ్రంథాలయానికి కంప్యూటర్, ప్రింటర్ మంజూరైందని లైబ్రేరియన్ ఆర్. దుర్గాప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, కార్యదర్శి ఎన్. లీలావతి చొరవతో కంప్యూటర్ మంజూరైందని చెప్పారు. ఇకపై గ్రంథాలయ వివరాలతో పాటు పాఠకులకు ఏయే పుస్తకాలు ఇచ్చినదీ, ఎన్ని పుస్తకాలున్నదీ, తదితర వివరాలన్నీ కంప్యూటర్‌లో నిక్షిప్తం చేస్తామన్నారు.

వైద్యులకు బదిలీలు

బాడంగి: మండల కేంద్రంలోని సామాజిక ఆస్పత్రిలో పనిచేస్తున్న ఇద్దరు వైద్యులు, నలుగురు స్టాఫ్‌నర్సులకు బదిలీ జరిగింది. ఆస్పత్రి ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న డాక్టర్ కె.రాజారమేష్‌కు బొబ్బిలి సీహెచ్‌సీకి.. ఆయుర్వేద వైద్యుడు శ్రీనివాసరావుకు తెర్లాం మండలం పెరుమాళికి బదిలీ జరిగింది. సీనియర్ వైద్యుడు కాశీవిశ్వనాథాధానికి ఆస్పత్రి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. అలాగే నలుగురు స్టాఫ్‌నర్స్‌లకు కూడా బదిలీ అయింది.

ఘనంగా దేశమ్మ తల్లి పండుగ



దేశమ్మ తల్లికి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

రామభద్రపురం: మండల కేంద్రంలో దేశమ్మ తల్లి పండుగ ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. బొక్కాపువీధి, చింతలవీధికి చెందిన భక్తులందరూ కలశాలతో గ్రామ పొలిమేరలకు వెళ్లి దేశమ్మ తల్లికి పుసుపు, కుంకుమ, చీరలు, కోళ్లు చెల్లించి మొక్కులు చెల్లించారు. ప్రతి ఏటా వరి ఆకుల పోసే సమయంలో వారాల పండుగ చేయడం ఆనవాయితీగా వస్తోందని పెద్దలు చెప్పారు.

లోక కల్యాణార్థం వేప, రావి చెట్లకు వివాహం



వధూవరులు వేప,రావి చెట్లు

బొబ్బిలి: పట్టణంలోని సింగారపువీధిలో కొలువైన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో లోకకల్యాణార్థం వేప, రావి చెట్లకు ఆదివారం వివాహం జరిపారు. ఆలయ ధర్మకర్తలు మల్లి కార్జునరావు, శ్రీనివాసరావు, సామ్రాట్, భక్త మండలి ఆధ్వర్యంలో జరిగిన ఈ వివాహానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. వధువుగా వేప చెట్టు, వరుడుగా రావి చెట్లను అందంగా అలంకరించి, వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ వివాహ వేడుక చక్కగా నిర్వహించారు.

శరవేగంగా హైవే పనులు



మండల కేంద్రం మీదుగా వెళ్తున్న హైవే

మెంటాడ: మండల కేంద్రం మీదుగా రాయపూర్ వైపు నిర్మిస్తున్న హరిత జాతీయ రహదారి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ప్రస్తుతానికి 60 శాతం పనులు పూర్తయినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. 2024 మార్చి నాటికి రహదారి పనులు పూర్తవుతాయని తెలిపారు.

సెప్టెంబర్ నాటికి గోదాం పూర్తి



మండల కేంద్రంలో నిర్మిస్తున్న గోదాం

మెంటాడ: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో నిర్మిస్తున్న గోదాం సెప్టెంబర్ నాటికి పూర్తవుతుందని పీఏసీఎస్ చైర్మన్ తాడ్డి రామచంద్రరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, 99 లక్షల రూపాయలతో చల్లపేట, జక్కువ, మెంటాడలో మూడు గోదాములు నిర్మిస్తున్నామని, అవి పూర్తయితే రైతులు పండించిన పంటలను భద్రపరుచుకోవచ్చన్నారు.

నాసిరకం విత్తనాలతో జాగ్రత్త..

- ప్రభుత్వం గుర్తించిన దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి
- కొనుగోలుకు సంబంధించి ఆధారాలు భద్రపరుచుకోవాలి
- రైతులకు సూచిస్తున్న వ్యవసాయాధికారులు



రామభద్రపురంలో దుక్కు చేపడుతున్న రైతు

రామభద్రపురం: రైతులు ఖరీఫ్ సీజన్ పనుల్లో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రస్తుతం గ్రామాల్లో దుక్కులు జోరుగా చేపడుతున్నారు. ఈ సమయంలో విత్తనాల ఎంపికలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. సాధారణంగా దుకాణదారులు నాసిరకం విత్తనాలు అంటగడుతుంటారు. ఇటువంటి విత్తనాలు కొనుగోలు చేసి రైతులు మోసపోకూడదనే ఉద్దేశంతో వ్యవసాయ శాఖాధికారులు రైతులకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరిస్తున్నారు.

తీసుకోవల్సిన జాగ్రత్తలు...

- రైతుభరోసా కేంద్రాల్లో లభించని విత్తనాలు వ్యవసాయశాఖ ద్వారా అనుమతి పొందిన దుకాణాల్లో మాత్రమే కొనుగోలు చేయాలి.
- కొనుగోలు చేసిన రశీదులను భద్రపరుచుకోవాలి.
- విత్తన శాంపిళ్లను పరిశీలించి, మొలకశాతం బాగుంటేనే వినియోగించాలి. లేనిపక్షంలో విత్తనాలు వాపసు ఇవ్వాలి.
- కొంతమంది వ్యాపారులు అనధికారంగా నకిలీ విత్తనాలను తెల్లసంచుల్లో విక్రయించే అవకాశం ఉంది. అలా విక్రయించే వారి సమాచారాన్ని తక్షణమే వ్యవసాయ శాఖాధికారులకు తెలియజేయాలి.
- ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థల నుంచే సర్టిఫైడ్ విత్తనాలు తీసుకోవాలి.
- వరి సాగుకు ముందు పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేయాలి.
- పచ్చిరొట్ట విత్తనాలైన కట్టిజనుము, పిల్లిపెసర, జీలుగ విత్తనాలను ప్రభుత్వం 50 శాతం రాయితీపై అందజేస్తోంది.

అప్రమత్తంగా ఉండాలి..



రైతుభరోసా కేంద్రాలలో విత్తనాలు తీసుకునే విధంగా ఏర్పాట్లు చేశాం. ముందుగా పేర్లు నమోదు చేసి క్రమపద్ధతిలో విత్తనాలు అందజేస్తాం. అలాగే ప్రభుత్వ గుర్తింపు ఉన్న దుకాణాల నుంచి విత్తనాలు కొనుగోలు చేయాలి. విత్తనాల మొలక శాతంలో తేడాలొస్తే వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేయాలి. విత్తనాలు కొనుగోలుకు సంబంధించిన రశీదులు భద్రంగా ఉంచుకోవాలి. నకిలీ విత్తనాలతో మోసపోతే పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు.

– వీటీ రామారావు, వ్యవసాయశాఖ జె.డి, విజయనగరం

వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను ఆదుకుంటాం..



ఉప సర్పంచ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి, ఎమ్మెల్యే శంబంగి, తదితరులు

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

బొబ్బిలి: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను అన్ని వేళలా ఆదుకుంటామని జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని అలజంగి ఉప సర్పంచ్ పొట్నూరు లక్ష్మునాయుడు ఇటీవల మృతి చెందారు.

విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడుతో కలిసి ఆదివారం గ్రామానికి చేరుకుని లక్ష్మునాయుడుకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ.. కార్యకర్తలు, నాయకులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు సంకిలి శాంతకుమారి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ తమ్మిరెడ్డి దామోదరరావు, తదితరులున్నారు.

నిషేధిత పాలిథిన్ కవర్లు వినియోగిస్తే చర్యలు



దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న శానిటరీ కార్యదర్శులు

రాజాం: నిషేధిత పాలిథిన్ కవర్లు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ హెచ్చరించారు. ఆదివారం స్థానిక పట్టణంలోని శానిటరీ కార్యదర్శులతో కలిసి పలు దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నిషేధిత పాలిథిన్ కవర్లు విక్రయిస్తున్న పలువురు వ్యాపారులకు నోటీసులు జారీచేశారు. అనంతరం ప్రజలు, వ్యాపారులకు పాలిథిన్ కవర్ల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో శానిటరీ వెల్ఫేర్ కార్యదర్శి గోవిందరావు, వలంటీర్లు పాల్గొన్నారు.

‘జగనన్న సురక్ష’ సర్వే



అంతకాపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమ సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శంకరరావు

రాజాం: మండలంలోని అంతకాపల్లి గ్రామపంచాయతీలో జగనన్న సురక్ష శిబిరాలు కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే ఆదివారం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి అప్పలనాయుడు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ప్రతీ ఇంటికి వెళ్లి, ప్రభుత్వ పథకాల అర్హులు, జనన, మరణ, కుల, ఆదాయం వంటి 11 రకాల ధ్రువీకరణ పత్రాలు కావాల్సిన వారి వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీఓ బాసూరి శంకరరావు పరిశీలించి, కార్యక్రమం సక్రమంగా అమలు చేయాలని సూచించారు.

అందుబాటులో ఎరువులు



తారాపురం ఆర్‌బీకేలో నిల్వ ఉన్న ఎరువులు



నాయుడువలస ఆర్‌బీకే వద్ద లారీ నుంచి ఎరువుల బస్తాలు దింపుతున్న కలాసీలు

రామభద్రపురం: మండల పరిధిలోని రైతులకు పంపిణీ చేసేందుకు 240 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉంచామని మండల వ్యవసాయాధికారి వెంకటయ్య తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఆర్‌బీకేలలో 168 మెట్రిక్ టన్నుల యూరియా, 72 మెట్రిక్ టన్నుల డీఏపీ సిద్ధంగా ఉంచామన్నారు. వాతావరణం అనుకూలించినందున నారుమడులు సిద్ధం చేసుకోవాలని సూచించారు.

17 ఆర్‌బీకేలలో..

బాడంగి: మండలంలోని 17 ఆర్‌బీకేలలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన వరి విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచినట్లు ఏఓ కె. శిరీష తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇప్పటివరకు ఆర్‌బీకేలలో పేర్లు నమోదు చేసుకున్న రైతుల అవసరం మేరకు ఎరువులు, విత్తనాలు తెప్పించామన్నారు. ఇంకా ఎవరైనా పేర్లు నమోదు చేసుకోకపోతే వెంటనే నమోదు చేయించుకోవాలని సూచించారు. కౌలు రైతులు వీఆర్‌ఓల నుంచి సీఆర్‌సీ కార్డులు తెచ్చుకుంటే వారికి కూడా విత్తనాలు, ఎరువులు అందజేస్తామన్నారు. మండలంలో 411 మట్టి నమూనాలు లక్ష్యం కాగా ఇప్పటివరకు 75 వరకు సేకరించినట్టు చెప్పారు. వాతావరణం అనుకూలిస్తే మిగిలినవి కూడా పూర్తి చేస్తామన్నారు. విత్తనాలు మొలక శాతం కట్టి 80 శాతం మొలక వస్తేనే నార్లు పోసుకోవాలని సూచించారు.

రక్తదానం.. ప్రాణదానం

రాజాం సిటీ: రక్తదానం ప్రాణదానంతో సమానమని, యువత రక్తదానానికి ముందుకురావాలని వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, వైద్యుడు గార రవిప్రసాద్ పిలుపునిచ్చారు. కరూర్ వైశ్యాబ్యాంక్ 107వ వార్షికోత్సవం సందర్భంగా పట్టణంలోని రాజాం బ్రాంచిలో రక్తదాన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు మనం దానం చేసిన రక్తం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రక్తం దానం చేస్తే అనారోగ్యం పాలవుతామన్న అపోహలు వీడాలని, ఆరోగ్యవంతులైన వారెవరైనా ప్రతీ మూడు నెలలకోసారి రక్తదానం చేయొచ్చన్నారు. మొత్తం 25 యూనిట్ల రక్తం సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు కె.సాయి ప్రశాంత్‌కుమార్, పి.చైతన్యకుమార్ పాల్గొన్నారు.

భారీ వర్షం



కురిసిన వర్షానికి రేగిడి పంట పొలాల్లో కనిపిస్తున్న నీరు

రేగిడి: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పొలాల్లో వేసుకున్న వరి విత్తనాలు మొలకెత్తేందుకు ఈ వర్షం ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చెరకు, వేరుశనగ తదితర పంటలకు ఈ వర్షం లాభం చేకూరుస్తుందన్నారు.

ఫీవర్ సర్వే చేయండి

రేగిడి: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ఇంటింటి ఫీవర్ సర్వే చేపట్టాలని పీహెచ్‌సీ వైద్యాధికారి జి.అసిరినాయుడు ఆదివారం ఓ ప్రకటనలో వైద్యారోగ్య సిబ్బందికి సూచించారు. ఏఎన్‌ఎంలు, ఆశకార్యకర్తలంతా గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి, జ్వరాల బారినపడిన వారి వివరాలు సేకరించి, వారికి సకాలంలో వైద్యసేవలు అందేలా చూడాలని తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దు

బొబ్బిలి: విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని కొత్తపెంటలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామంలోని ఓ విద్యుత్ స్తంభానికి సపోర్ట్‌గా ఉన్న వైర్‌కు ఎద్దు రాసుకుపోవడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. ఎద్దు యజమాని గంట శంకరరావు లబోదిబోమంటున్నాడు.

హిజ్రాల జీవిత సంఘర్షణే ‘అర్ధనారి’



శాంతారావును సన్మానిస్తున్న రారవే సభ్యులు

రాజాం సిటీ: నేటి సమాజంలో ఆడ, మగ కాని మధ్యరకమైన హిజ్రాలు పడే జీవిత సంఘర్షణనే బండి నారాయణస్వామి అర్ధనారి నవలగా మలిచారని ప్రముఖ సాహితీవేత్త రాజాపు శాంతారావు అన్నారు. ఆదివారం స్థానిక విద్యానికేతన్ స్కూల్‌లో రాజాం రచయితల వేదిక(రారవే) 101 సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ‘అర్ధనారి నవలలో సామాజిక పరిశీలన అనే అంశంపై ప్రసంగించారు. అర్ధనారి నవలలో హిజ్రాల సంఘర్షణతో పాటు వేశ్యల బాధాకరమైన జీవితాలను కూడా వాస్తవ రూపంలో వర్ణించడం జరిగిందన్నారు. పురుషులు స్త్రీలగా మారే క్రమంలో హిజ్రాగా స్థిరపడడం, సంఘం వారిపై చూపించే చిన్నచూపు, హిజ్రాలను, వేశ్యలను పోలీసులు పెట్టే హింసను చక్కగా కళ్లకు కట్టినట్లు తెలిపారన్నారు. ధనిక హిజ్రాలు, పేద హిజ్రాల మధ్య కూడా సమాజం చూపే భిన్నమైన చూపును, పేదింటి తల్లిదండ్రులే తమ పిల్లలు హిజ్రాలుగా మారితే చూసే హీనమైన దృష్టిని ఆయన వివరించారన్నారు. ఇప్పటికైనా హిజ్రాల పట్ల ఆదరణ, సమభావంతో ప్రవర్తించాలని కోరారు. అనంతరం శాంతారావును రారవే సభ్యులు దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆల్తి మోహనరావు, గార రంగనాథం తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణపై కేసు నమోదు

రాజాం సిటీ: మండల పరిధిలోని వీఆర్‌అగ్రహారం గ్రామానికి చెందిన జె.శ్రీధర్ గ్రామానికి చెందిన కొంతమంది తన భూమిని ఆక్రమించుకున్నారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ కె.రవికుమార్ ఆదివారం తెలిపారు. గతంలో గ్రామంలో 72 సెంట్ల భూమి తనదేనని రెవెన్యూ అధికారులు నిర్ధారించారని, అయినప్పటికీ గ్రామానికి చెందిన డి.వెంకటరమణ అనే వ్యక్తి ఆక్రమణలకు పాల్పడుతున్నాడని ఫిర్యాదులో శ్రీధర్ పేర్కొన్నాడు. జగనన్నకు చెబుదాం(స్పందన కార్యక్రమం)లో ఫిర్యాదు చేసినట్లు శ్రీధర్ పేర్కొన్నాడని సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

ముమ్మరంగా వ్యవసాయ పనులు



దుక్కి చేస్తున్న రైతు



విత్తనాలు జల్లుతున్న రైతు

వంగర: మండలంలోని అన్ని గ్రామాల్లో వ్యవసాయ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. అడపాదడపా కురుస్తున్న వర్షాలు సాగుకు అనుకూలంగా ఉండడంతో వరి ఎద పనుల్లో రైతులు బిజీబిజీగా ఉన్నారు. వర్షాధార భూములు, మెట్టు ప్రాంతాల్లో వరి సాగు చేసే వారంతా దుక్కి పనులు చేపట్టి, విత్తనాలు చల్లుతున్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



విద్యార్థులను సత్కరించిన స్నేహం అసోసియేషన్ సభ్యులు

రాజాం సిటీ: ఐఐటీ, నీట్‌లలో ఉత్తమ ర్యాంకులు సాధించిన ప్రతీ విద్యార్థి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించి, తమ జూనియర్‌లకు ప్రేరణగా నిలవాలని రాజాం టౌన్, రూరల్ సీఐలు కె.రవికుమార్, హెచ్.ఉపేంద్రలు ఆకాంక్షించారు. స్థానిక అంబికా ఫ్యాక్టరీ ఆవరణలో ఈ ఏడాది ఐఐటీ, నీట్‌లలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు స్నేహం అసోసియేషన్ ఆధ్వర్యంలో మెమొంటోలు, పుష్పగుచ్ఛాలతో ఆదివారం సత్కరించారు. వారు మాట్లాడుతూ కొత్తగా కళాశాలలకు వెళ్తున్న విద్యార్థులు చెడు వ్యసనాలకు లోనుకాకూడదని, మనో నిబ్బరంతో పాటు ఆత్మవిశ్వాసంతో ఉండాలని, పరిస్థితులను చక్కగా ఆకలింపు చేసుకుని ముందుకుసాగాలన్నారు. బాగా చదువుకుని, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. సత్కారం పొందిన వారిలో బి.ధనుష్‌సాయి, ఎం.అవినాష్‌కుమార్, ఆర్.నిఖిల్, ఆర్.కార్తీక్‌నాయుడు, పి.జగన్నాథం, జి.హాసిని, వి.గ్రీష్మంత్, టి.సింధురత్నం ఉన్నారు. కార్యక్రమంలో స్నేహం అసోసియేషన్ సభ్యులు ఎ.కోటేశ్వరరావు, కె.సాయిప్రశాంత్‌కుమార్, టీవీ అచ్యుత్‌కుమార్, జి.పాపారావు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా పారిశుద్ధ్య పనులు



కాలువల్లోని పూడికలు తీస్తున్న కూలీలు

రేగిడి: మండలంలోని వన్నలి, చాటాయివలస, గుళ్లపాడు గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు జోరుగా కొనసాగుతున్నాయి. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నట్లు సర్పంచ్‌లు గార రమణ, కరణం గోవిందరావు, వియ్యపు చక్రపాణి తెలిపారు.

నేటినుంచి ఉచిత ఉపాధి శిక్షణ

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో సోమవారం నుంచి నిరుద్యోగ యువతీ యువకులకు ఇచ్చే ఉచిత ఉపాధి శిక్షణ ప్రారంభం కానున్నట్లు ప్రిన్సిపాల్ బి.భాస్కరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ హార్డ్‌వేర్, టూ వీలర్ సర్వీస్, అసిస్టెంట్ సర్వేయర్, డేటాఎంట్రీ ఆపరేటర్, ఎలక్ట్రానిక్స్ సొల్యూషన్ తదితర కోర్సుల్లో శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ప్లేస్‌మెంట్ కల్పించనున్నామని స్కిల్ హబ్ డీఎస్‌డీఓ గోవిందరావు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆధార్‌కార్డు, 10వ తరగతి పాస్ సర్టిఫికెట్ జిరాక్స్‌లతో ఐటీఐలో సంప్రదించాలని, మరిన్ని వివరాలకు 7286042743, 8121450657కు ఫోన్ చేయాలని కోరారు.

చురుగ్గా ఈకేవైసీ నమోదు

సంతకవిటి: మండలంలోని 24 గ్రామ సచివాలయాల పరిధిలో ఈకేవైసీ నమోదు ప్రక్రియ చాలా చురుగ్గా కొనసాగుతోంది. ఈ నెల 28వ తేదీన జగనన్న అమ్మఒడి నిధులు విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనున్న నేపథ్యంలో స్మార్ట్ ఫోన్ సహాయంతో ఈకేవైసీ చేయిస్తున్నారు. గడువులోగా ఈకేవైసీ నమోదును పూర్తి చేయాలని వలంటీర్లకు ఎంపీడీఓ జి.వి.రవికుమార్ సూచించారు.

పక్కాగా ‘జగనన్న సురక్ష’ అమలు

- ఎమ్మెల్యే కంబాల జోగులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: అన్ని శాఖల సమన్వయంతో జగనన్న సురక్ష శిబిరాలు కార్యక్రమం పక్కాగా అమలుచేయాలని ఎమ్మెల్యే కంబాల జోగులు ఆదేశించారు. ఆదివారం స్థానిక పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద పార్టీ నేతలతో సమావేశమైన ఆయన జూలై 1 నుంచి జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు గ్రామాల్లో పర్యటించి, ప్రజాసమస్యలు గుర్తించడంతో పాటు అర్హులకు పథకాలు, అవసరమైన వారికి జనన, మరణ, కుల, ఆదాయం వంటి 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఎటువంటి ఫీజు లేకుండా అందించనున్నారన్నారు. పార్టీ శ్రేణులు కూడా అధికారులకు సహకరించాలని కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ కన్వీనర్లు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, రాజాం పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, వంజరాపు విజయ్‌కుమార్, జేసీఎస్ కన్వీనర్ కామోదులు శ్రీరంగంనాయుడు, సర్పంచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.